# సింగిల్ పేజీ కథలు

ఏ రోజూ లేనిది ఆ రోజు అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు ఆనందరావ్.

ముఖంలో ఏదో టెన్షన్. ఓసారి ఇంట్లోకి వెళ్లి వచ్చాడు. బయట మెయిన్ గేటు దగ్గరకు వడివడిగా నడిచాడు. తిరిగి వరండాలో కొచ్చాడు. మూడవసారి వాచీ చూసుకున్నాడు. టైం తొమ్మిది గంటల పదిహేను నిముషాలు. మరలా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.




ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఆనందరావు ఆరోజు విచిత్రంగా ప్రవర్తించేసరికి వంటగదిలో నుండి అనుమానంగా వచ్చి, పదినిముషాల నుండి గమనిస్తుంది ఆండాళమ్మ.

తన కోసం వుంచిన లంచ్ బాక్స్ తీసుకుని వాకిట దాటి మరలా వరండాలో అడుగు పెట్టాడు ఆనందరావ్!

మరలా ఓసారి వాచీ చూసుకొని, ఇటు, అటు పచార్లు చేస్తున్న ఆనందరావ్‌ను చూసి ఇక ఉండబట్టలేక అడిగింది ఆండాళమ్మ.

''ఏమిటండీ!? ఎవరికోసం?'' అని అడిగింది.

భర్త ఏం సమాధానం చెప్పకపోయేసరికి, ఆయన ముఖంలో వున్న ఆత్రుత చూసి గుండె జారిపోయినట్లనిపించింది ఆండాళమ్మకి.

మరింత సీరియస్‌గా ముఖం పెట్టి, ముఖం నుండి కారుతున్న చెమటను సైతం పట్టించుకోకుండా పచార్లు చేస్తున్నాడు ఆనందరావ్.

## సంప్రదాయం

'ఏమండీ, మిమ్మల్నే..ఏమైందో చెప్పండీ..'' మనసు పలు విధాలుగా పోతుంటే నిగ్రహించుకుంటూ అడిగింది ఆండాలు విషయం ఏమిటో అర్థంగాక.

'ఏం లేదు. లోపల గడియారంలో టైం..టైం ఎంతైందో చూడు?!'' అతని మాటల్లో గాభరా స్పష్టంగా తెలుస్తోంది.

'మీ చేతికి వాచీ ఉంది కదండీ..'' బాధ వేదనగా మారుతుంటే..గుండె వేగం పెరిగింది. అంతా అయోమయంగా తోస్తుంది ఆండాళమ్మకు.

''లోపలా ఉంది గా..'' ఆత్రం ఆరాటం ఆ మాటల్లో వణుకు!

ఏమీ అర్థంగాక ''భగవంతుడా ఎప్పుడూ లేనిది ఆయన ప్రవర్తన..ఏంటి స్వామీ! నాకీ పరీక్ష' కళ్ళు మూసుకొని తాళిని కళ్ళకు అద్దుకొని, టైం చూసి వచ్చి చెప్పింది. ''తొమ్మిదీ నలభై ఐదు!'' అని.

''డామిట్!..నా వాచీ నయం..'' చిరాగ్గా అన్నాడు ఆనంధరావ్.

''ఏమైందండీ..మీకీ రోజు పెద్ద క్వశ్చన్‌మార్క్ మొహంతో మరలా అడిగింది ఆండాళమ్మ.

''ఏం కాలేదులే!..నా వాచీలో తొమ్మిది యాభై''

ఎవరైనా వస్తానన్నారేమో అని అనుమానమేసి ''ఎవరొస్తానన్నారండీ..?''కంగారుగా అడిగింది ఆండాలు.

ఆత్రం తప్ప సమాధానం లేదు.

లోనికి వెళ్ళి టవల్ తెచ్చి ఇచ్చింది. పెద్ద పెద్ద కళ్ళతో ఆశ్చర్యంగా చూశాడు ఆమె వైపు ఆనందరావు.

''నేను టవల్ తెమ్మని అడగలేదే?'' అన్నాడు.

''ముఖంపై వున్న చెమట తుడుచుకుంటారని నేనే తెచ్చాను. ఇంతకీ మీపై ఆఫీసర్లు ఎవరన్నా వస్తానన్నారా? అంతగా టెన్షన్ పడుతున్నారు?'' సమాధానం చెప్పని ఆ ప్రశ్న మరలా అడిగింది ఆండాలమ్మ ఉండబట్టలేక.

''ఎవరొస్తారు? ఎవరన్నా వస్తారని నేను చెప్పానా?!'' ముఖం చిట్లించి మరింత చిరాగ్గా అడిగాడు ఆనందరావ్.

''అయితే ఎందుకంత టెన్షన్ పడ్తున్నారు?'' ఈసారి మరింత ఆశ్చర్యంగా అడిగింది, ఆండాలమ్మ.

''ఒసే పిచ్చిమొహమా! టైం పదైందనుకొని తయారై తీరా బయలుదేరేటప్పుడు చూసుకొంటే 'తొమ్మిదే' అయింది. ఆఫీసుకు అరగంట లేటుగా వెళ్ళడం సంప్రదాయంగానీ, గంట ముందు వెళితే పిచ్చోడనుకోరూ?! ఎంతకీ గడియారం ముల్లు ముందుకు కదలకుంటే విసుగుతో ఇటు అటు తిరిగాను. సరే గానీ టైం ఎంతో చూడు!'' చెప్పాడు ఆనందరావ్.

''హమ్మయ్య! ఏమైందోనని భయపడి వచ్చాను కదండీ. స్టౌమీద పెట్టిన పాలు పొంగిపోతాయి. మీరే చూస్కోండి టైం ఎంతో!'' అంటూ విసురుగా వంటింట్లోకి వెళ్ళిపోయింది ఆండాలు''

'టైం పది! హమ్మయ్య ఇక బయలుదేరొచ్చు. దారిలో పెత్తనాలు చేసుకుంటూ వెళ్తే ఆఫీసుకి చేరడానికి అరగంట పైనే పడ్తుంది' అనుకుంటూ ఆనందంగా కదిలాడు ఆనందరావ్ లంచ్ బాక్స్ తీసుకొని.

-రోషన్ మొగల్ (నెల్లూరు)